సాక్షి
తిరుపతి

బుధవారం, 15, నవంబర్, 2023



విద్యార్థుల మేధోశక్తి అద్భుతం

నేటి తరం విద్యార్థుల ఆలోచనా విధానం, మేధోశక్తి అద్భుతమని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - 8లో



శాస్త్రోక్తంగా బిల్వార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. - 8లో



క్యాన్సర్ రహిత జిల్లానే లక్ష్యం

క్యాన్సర్ రహితంగా జిల్లానే లక్ష్యంగా పింక్ బస్సు సేవలు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

17న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ : తిరుపతిలోని ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ, గ్లోబల్ భారత్, మెగా మెడికల్స్ అండ్ సర్జికల్స్ కంపెనీ ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొని సుమారు 150 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఫార్మసీ, ఎమ్ ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 7989810194, 8790503630 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తపాలా జీవిత బీమా ఏజెంట్ పోస్టులకు దరఖాస్తులు



జాఫర్ సాధిక్, పోస్టల్ సూపరింటెండెంట్

తిరుపతి అర్బన్ : తపాలాశాఖలో జీవిత బీమా ఏజెంట్లుగా చేరేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఇస్తూ కోట్లాది మందికి జీవిత బీమా కల్పిస్తోందన్నారు. ఈ క్రమంలో ఏజెంట్లకు ఆకర్షణీయమైన ఇన్సెంటివ్ ఇస్తున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 50 ఏళ్లలోపు పదోతరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తపాల జీవిత బీమా కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు. ఇతర వివరాల కోసం 0877–2289201, 9390736277 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,902 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,858 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.24 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు సూళ్లూరుపేట విద్యార్థిని




విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న అధ్యాపకులు

సూళ్లూరుపేట : ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.చందన ఎంపికైంది. విక్రమ సింహపురి వర్సిటీ ఎన్ఎస్ఎస్ తరఫున కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 1 నుంచి 10 వరకు ఆమె శిక్షణ తీసుకుంది. మొత్తం ఆరు రాష్ట్రాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్న ఈ శిక్షణ కార్యక్రమంలో బెస్ట్ వలంటీర్‌గా చందన ఎంపికైనట్లు వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కల్లమ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పి.ఏడుకొండలు, బి.శ్రీనివాస్ అభినందించారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ జారీ చేసిన సర్టిఫికెట్ అందజేశారు.

సమ్మోహనం







గజ వాహనంపై విహరిస్తున్న పద్మావతీదేవి (ఇన్‌సెట్) పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తిరుమల నుంచి కాసుల హారాన్ని తీసుకువస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి

తిరుచానూరు కార్తీక శోభతో అలరారుతోంది.. బ్రహ్మోత్సవ తేజస్సుతో శ్రీవారి దేవేరి విరాజిల్లుతోంది. సర్వాలంకారభూషితులైన శ్రీపద్మావతీదేవి పల్లకిపై కొలువుదీరారు. జగన్మోహిని అలంకారంలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సుగంధ పరిమళ పుణ్యజలాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనంలో సేదతీరారు. వైకుంఠనాథుడు అత్యంత ప్రేమపూర్వకంగా అందించిన సహస్ర లక్ష్మీ కాసుల హారం ధరించి మురిసిపోయారు. మంగళవాయిద్యాలు.. వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీమహాలక్ష్మి అవతారంలో గజవాహనాన్ని అధిష్టించి సకల జీవకోటికి అభయమిచ్చారు.

- అంగరంగ వైభవంగా పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు
- పల్లకిపై ఊరేగిన అమ్మవారు
- గజవాహనంపై విహరిస్తూ అభయం
- వేడుకగా లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
- నేడు స్వర్ణ రథోత్సవం

చంద్రగిరి(తిరుచానూరు) : శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన మంగళవారం ఉదయం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉదయం 7గంటలకు అద్దాల మండపానికి వేంచేపు చేసి పట్టుపీతాంబరాలు, వజ్రవైడూర్య ఆభరణాలు, చేతిలో బంగారు చిలుక, కమలం చేతబట్టిన జగన్మోహినిగా అలంకరించారు. అనంతరం 8గంటలకు అమ్మవారు పల్లకిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి 8గంటలకు గజవాహన సేవలు జరిపించారు. కార్యక్రమాల్లో పెద్ద జీయర్, చిన్న జీయర్‌స్వాములు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, వీఎస్‌ఓ బాలిరెడ్డి, ఏఈఓ రమేష్, ఏవీఎస్‌ఓ శైలేంద్ర బాబు, సూరింటెండెంట్ మధు, శ్రీవాణి పాల్గొన్నారు.

కనులపండువగా శోభాయాత్ర

పున్నమి గరుడసేవలో తిరుమల శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారం మంగళవారం శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ముందుగా శ్రీవారి ఆలయంలో లక్ష్మీహారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో హారాన్ని బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ శ్రీహరి నేతృత్వంలో హారాన్ని తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకువచ్చి డిప్యూటీ ఈఓ గోవిందరాజన్‌కు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం హారాన్ని తిరువీధుల్లో శోభాయాత్రగా ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. రాత్రి గజవాహన సేవలో అమ్మవారు సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని ధరించి భక్తులకు దర్శనమిచ్చారు.

శోభాయమానంగా ఆధ్యాత్మిక యాత్ర

ఆధ్యాత్మిక మహా పాదయాత్ర ఆద్యంతం శోభాయమానంగా సాగింది. ఆలయం వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ శ్రీ గోవింద రాజన్ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు



సహస్ర లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర



అమ్మవారి పల్లకీ ఉత్సవంలో అశేష భక్తజనులు

గొడుగుల వితరణ

శ్రీ పద్మావతి అమ్మవారికి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తిరవనింద్రకు చెందిన శ్రీమత్ రామానుజ ట్రస్ట్ వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా రెండు గొడుగులను టీటీడీకి అందజేశారు.

నేడు స్వర్ణ రథోత్సవం

శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4.20 నుంచి 5.20 గంటల మధ్య అమ్మవారికి స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

శ్రీవారి పట్టపురాణి తిరుచానూరు పద్మావతి అమ్మవారికి గజ వాహన సేవను పురస్కరించుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తిరుచానూరు అమ్మవారి ఆలయానికి పట్టువస్త్రాలతో మహా పాద యాత్రగా బయలుదేరారు. గాంధీపురం, అవిలాల, లింగేశ్వర నగర్, సాయినగర్, శ్రీనివాసపురం, పద్మావతీపురం మీదుగా తిరుచానూరుకు పాదయాత్ర చేరుకుంది. అమ్మవారికి సమర్పించే పట్టు వస్త్రాలకు ఆయా ప్రాంతాల్లో భక్తులు కర్పూర హారతులు, పుష్పాలు సమర్పించారు.

ఉద్యోగులకు తోడుగా నిలుస్తూ.. భక్తుల సేవలో తరిస్తూ..!

- రామ్‌నగర్ క్వార్టర్స్‌లో అభివృద్ధికి నిధులు
- సిబ్బందికి బ్రహ్మోత్సవ బహుమానం
- ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూముల్లో మౌలిక వసతులు
- టీటీడీ బోర్డు చైర్మన్ భూమన

తిరుమల : శ్రీవారి భక్తులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నామని, టీటీడీ ఉద్యోగులకు సైతం తోడుగా నిలుస్తూ, వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమల లో నిర్వహించిన టీటీడీ పాలక మండలి సమావేశంలో తీసుకు న్న నిర్ణయాలను ఆయన వివరించారు. భూమన మాటల్లోనే..

- వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు అందించడానికి అవసరమైన పనులు వేగంగా సాగుతున్నాయి.
- సదరు భూమిలో రూ.25.67 కోట్లతో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి టెండరు ఖరారు చేశాం. ఈ ప్రాంతంలో ఉద్యోగులకు అదనంగా కేటాయించిన 132 ఎకరాల్లో కూడా గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లతో టెండర్లు పిలవడానికి ఆమోదం తెలిపాం. ఇందుకయ్యే ఖర్చును ఉద్యోగులు భరిస్తారు. రిటైర్డ్ ఉద్యోగులు సహా అందరికీ ఇవ్వడానికి ఇంకా భూమి కోరాం. త్వరలో మరిన్ని ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది.



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన ఈఓ ధర్మారెడ్డి తదితరులు

- తిరుపతిలో టీటీడీ ఉద్యోగులు నివసిస్తున్న రామ్‌నగర్ క్వార్టర్స్‌లో రూ.6.15 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి టెండర్లు ఆమోదించాం.
- మ్యాన్ పవర్ సర్దుబాటులో భాగంగా ప్రస్తుతం టైపిస్ట్, టెలెక్స్ ఆపరేటర్, టెలిఫోన్ ఆపరేటర్ గ్రేడ్–1 హోదాల్లో ఉన్న ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్పు చేసేందుకు ఆమోదించాం.

- తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన, భక్తులకు చక్కటి సేవలందించిన టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం అందించాలని నిర్ణయించాం.
- ఈ మేరకు రెగ్యులర్ ఉద్యోగులకు రూ.14 వేలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.6,850 అందించనున్నాం.

- టీటీడీ అన్నప్రసాదం విభాగంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ తరఫున క్లీనింగ్, సర్వింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ సేవలు అందిస్తున్న 528 మంది కార్మికులను మరో మూడు నెలల పాటు కొనసాగించేందుకు రూ.2.40 కోట్లు మంజూరు చేశాం.
- తిరుమల ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఐదు ప్యాకేజీల కింద సేవలందిస్తున్న 1,694 మంది పారిశుద్ధ్య కార్మికులను మరో ఏడాది పాటు కొనసాగించేందుకు రూ.3.40 కోట్లు మంజూరు చేశాం.
- తిరుమలలో ఎఫ్ఎంఎస్ సేవలను మరో ఏడాది పాటు పొడిగించేందుకు గాను సౌత్ ప్యాకేజీ రూ.13.20 కోట్లు, ఈస్ట్ ప్యాకేజీ రూ.9.60 కోట్లు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపాం.
- అన్నప్రసాదాల తయారీకి అవసరమైన పప్పు దినుసులు, చక్కెర, మిరపకాయలు, నెయ్యి డబ్బాలు నిల్వ ఉంచడానికి తిరుపతిలోని అలిపిరి వద్ద మార్కెటింగ్ గోడౌన్ల ప్రాంగణంలో రూ.11.05 కోట్లతో నూతన గోదాము నిర్మాణానికి టెండర్లు ఆమోదించాం.

- తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనం కోసం విచ్చేసే భక్తులు ట్రాఫిక్ ఇక్కట్లు పడకుండా మంగళం ఆర్‌టీఓ కార్యాలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పద్మావతి ఫ్లోర్‌మిల్ వరకు గల 2.90 కిలోమీటర్ల రహదారిని 80 అడుగుల రోడ్డు గా విస్తరించేందుకు రూ.15.12 కోట్లు మంజూరు చేశాం.

- రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి ఆస్పత్రి నుంచి తిరుచానూరు వద్ద హైవే వరకు ఉన్న రోడ్డును డివైడర్లతో నాలుగు లేన్లు అభివృద్ధి చేసేందుకు రూ.13.29 కోట్లతో టెండరు ఆమోదించాం.
- రేణిగుంట రోడ్డులోని హీరో షోరూమ్ నుంచి తిరుచానూరు గ్రాండ్ రిడ్జ్ హోటల్ వరకు 1.135 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3.11 కోట్లతో టెండర్లు ఆమోదించాం.
- తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె జంక్షన్ నుంచి పాత తిరుచానూరు రోడ్డు జంక్షన్ వరకు (అన్నమయ్య మార్గం), 2వ సత్రం నుంచి అన్నమయ్య మార్గం వరకు ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్లు, సెంట్రల్ డివైడర్ తదితర అభివృద్ధి పనుల కోసం రూ.4.89 కోట్లు మంజూరు చేశాం.

సముద్రంలో చేపల వేట రద్దు



శ్రీనివాస నాయక్, మత్స్యశాఖ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో చేపల వేటను రద్దు చేసినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశముందన్నారు. ఈ నెల 17వ తేదీన తీరం దాగే క్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అప్పటి వరకు వేటకు విరామం ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తీరంలో ఈదురుగాలులు వీచే ప్రమాదమున్నందున ముందస్తు జాగ్రత్తగా చేపల వేటను రద్దు చేసినట్లు వివరించారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారిని వెంటనే ఒడ్డుకు రప్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయాల్లోని మత్స్యకార సహాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తుపాను సమయంలో చేపలు తీరానికి భారీగా కొట్టుకువస్తుంటాయని, స్థానికులు వాటి కోసం వెళ్లి చిక్కుల్లో పడవద్దని స్పష్టం చేశారు.

సైనిక్, మిలిటరీ స్కూళ్లలో బాలికలకు ప్రవేశం

తిరుపతి ఎడ్యుకేషన్ : సైనిక్, రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లల్లో 9వ తరగతికి సంబంధించి బాలికలకు తొలిసారిగా ప్రవేశం కల్పించినట్లు విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మిలిటరీ స్కూల్లో ప్రవేశ పరీక్షకు ఈ నెల 23వ తేదీలోపు, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు డిసెంబర్ 16వ తేదీలోపు బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా ప్రవేశ పరీక్షలు, దరఖాస్తులు, నమూనా పరీక్షలకు సంబంధించి వివరాలకు తమ సమాచార కేంద్రంలో నేరుగాను, అలాగే 86888 88802, 92999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'గుండె గుడి' సేవలు అభినందనీయం



డాక్టర్ శ్రీనాథరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి తుడా: గుండె గుడిగా మారిన శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం సేవలు అభినందనీయమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ కొనియాడారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, వైద్య బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ ప్రాణపాయ స్థితిలోని వందలాది మంది చిన్న పిల్లలకు పద్మావతి హృదయాలయం పునర్జన్మ ప్రసాదిస్తోందన్నారు. పేద పిల్లలకు రూ.లక్షలు ఖర్చు అయ్యే గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, టీటీడీ ప్రాణదానం పథకం కింద ఉచితంగా చేస్తున్నారని వెల్లడించారు. 95శాతానికి పైగా సక్సెస్ రేటుతో 2 వేలకు పైగా ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రికగా ప్రారంభమైన హృదయాలయం, నేడు శ్రీవారి ఆశీస్సులతో విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. 8 మందికి గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేసి దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సాధించిందని వెల్లడించారు.

అక్రమార్కులకు అండ..దండ



ఆక్రమిత భూమిలో యథేచ్ఛగా సాగు

- ఎస్సీ, ఎస్టీలు అభ్యంతరం చెబుతున్నా దర్జాగా సాగు
- రెవెన్యూ అధికారులకు ఫోన్‌చేసినా స్పందించని వైనం
- ఆందోళనకు సిద్ధమవుతున్న గంగలపూడి ఎస్సీ, ఎస్టీలు

సాక్షి, తిరుపతి: 'భూములను ఆక్రమించుకుని దర్జాగా వరి నాట్లు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఎస్సీ, ఎస్టీలు వెళ్లి అభ్యంతరం చెప్పినా అక్రమార్కులు వినిపించుకోలేదు. అధికారులకు ఫోన్‌చేసినా స్పందించడం లేదు' అని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం, గంగలపూడి గ్రామ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భూ పంపిణీ కింద భూములు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సహకారంతో వేలవేడు, ఎంపేడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు, లబ్ధిదారులకు ఇచ్చిన భూములను ఆక్రమించుకున్న విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. గంగలపూడిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూముల్లో దర్జాగా సాగు చేసుకుంటున్నారు. వారం రోజులుగా మడులుచేసి వరి నాట్లు వేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు కొందరు వరి నాట్లు ఎలా వేస్తారని టీడీపీ నేతలను ప్రశ్నించారు. అయితే వారు పట్టించుకోక పోగా.. 'ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో. మమ్మల్ని ఎవ్వడూ ఏమీ చేయలేడు' అని సమాధానం ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వరినాట్లు వేస్తున్నారని స్థానిక రెవెన్యూ అధికారికి ఫోన్‌చేసినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు.

దర్జాగా సాగు

వేలవేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నం.247/2, 3లో 10 ఎకరాలు, 248/1లో 4.41 ఎకరాల కాలువ పోరంబోకు భూములు ఉన్నాయి. ఈ భూములను పల్లంపేటకు చెందిన టీడీపీ నేత ఆక్రమించుకుని సాగులోకి తెచ్చాడు. అందులో వారం రోజులుగా వరి నాట్లు వేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఎంపేడు రెవెన్యూ పరిధిలోని ఈశ్వరయ్యకాలనీకి చెందిన టీడీపీ నేతలు సుమారు 50 ఎకరాలు ఆక్రమించుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలు ఉన్నాయి.

క్లుప్తంగా

పాఠశాలల్లో అభివృద్ధి పనుల తనిఖీ



మల్లంగుంట హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి నగరం, రూరల్, రామచంద్రాపురం మండలంలోని పలు ప్రభుత్వం పాఠశాలలను విద్యాశాఖ ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. తిరుపతిలోని మాల్వాడీ స్కూల్, శ్రీపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నత పాఠశాల, తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట, రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరులోని జెడ్పీ హైస్కూళ్లలో నాడు–నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మార్ట్ టీవీల పని తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఆర్‌జేడీ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పాఠ్యాంశాలు బోధిస్తూ, పిల్లల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, డీవైఈఓ ఆనందరెడ్డి, ఎంఈఓలు దేవరాజులురెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల మేధోశక్తి అద్భుతం

తిరుపతి కల్చరల్ : విద్యార్థుల మేధోశక్తి అద్భుతమని, ఇప్పటి పిల్లల ఆలోచనలు వేగంగా ఉన్నాయని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భూమన ముందుగా నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. టీటీడీ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలివితేటలు పెంపొందించేందుకు ఇలాంటి క్విజ్ పోటీలు ఉపయోగపడతాయన్నారు. క్విజ్ పోటీల్లో సత్తా చాటే విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు పొందుతారని తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన రెండో మంచి కార్యక్రమం ఈక్విజ్ పోటీలని ప్రశంసించారు. తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండీ, సీఈఓ, కమిషనర్ హరిత మాట్లాడుతూ నగరంలోని 110 పాఠశాలల నుంచి నలుగురు చొప్పున మొత్తం 440 మంది పోటీ పడగా, అందులో 8 టీమ్‌లను సెలెక్ట్ చేసినట్లు వెల్లడించారు. బాలల దినోత్సవం సందర్భంగా తుది పోటీల్లో మొదటి స్థానాన్ని శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకొని రూ.లక్ష బహుమతిని పొందారని తెలిపారు. రెండో స్థానంలో కిరణ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు నిలిచి రూ.50వేలు అందుకున్నట్లు చెప్పారు. మూడో బహుమతిని అట్లాంటీస్ ది వరల్డ్ స్కూల్ విద్యార్థులు పొందారని వివరించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థుల తెలివితేటలు అమోఘమని, ఇంతటి మంచి కార్యక్రమం రూపకర్త కమిషనర్ హరిత ఆలోచనలు అనుసరణీయమని కొనియాడారు. విజేతలను ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అభినందించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.



విజేతలకు మెగా చెక్కు అందిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత



కళాకారుల నృత్య ప్రదర్శన

సహకార సేవలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి అర్బన్: సహకార బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతిలోని ప్రాంతీయ కేంద్ర సహకార బ్యాంకు వద్ద వారోత్సవాలను ప్రారంభించారు.

కారును ఢీకొన్న ఐషర్ వాహనం

చంద్రగిరి: తిరుపతి నుంచి చిత్తూరు వైపు మంగళవారం వెళ్తున్న కారును వెనుక నుంచి ఐషర్ వాహనం ఢీకొనడంతో ఒంగోలుకు చెందిన సురేష్, లక్ష్మీ గాయపడ్డారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం వద్ద మంగళవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చిట్టమూరు మండలం గునపాటిపాళానికి చెందిన నెమళ్లపూడి గోపాల్‌రెడ్డి (55) బైక్‌పై తిక్కవరం వైపు ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో అక్కడిక్కడే మరణించాడు. హోంగార్డు మోహన్ దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అంజిరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ అభివృద్ధే అజెండా

- వర్సిటీలో సమూల మార్పులకు ఈసీ ప్రణాళిక

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధే అజెండాగా నూతనంగా ఏర్పాటైన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) తొలి అడుగు వేయనుంది. వేతనాల సవరణ, పరీక్ష విధానంలో మార్పులు, ఫలితాల వెల్లడిలో జాప్యాన్ని అధిగమించడంతోపాటు పరీక్ష కేంద్రాలు, మూల్యాంకన కేంద్రాల పెంపునకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు వర్సిటీలో సమూల మార్పులపై దృష్టి సారించింది. అందులో భాగంగా త్వరలో నిర్వహించనున్న సమావేశంలో పలు అంశాలపై వర్సిటీ అధికారులతో చర్చించనుంది. ఈసీ అంటే కేవలం నామమాత్రపు కమిటీ కాదని నిరూపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈసీ సభ్యులుగా నియమించిన 9 మంది విద్యారంగంలో సుమారు 30 నుంచి 40ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉండటంతో వర్సిటీ అభివృద్ధిపై దృష్టి సారించారని పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు.

ప్రధాన అంశాలు ఇవే..

- డిసెంబర్ రెండో వారంలో నిర్వహించనున్న డిగ్రీ ఒకటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలను ఒకే దశలో చేపట్టడం.
- మదనపల్లె, పీలేరు, తిరుపతి, పలమనేరులో పరీక్ష కేంద్రాల ఏర్పాటు.
- విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులే పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు ప్రామాణికంగా తీసుకోవడం.
- పరీక్ష కేంద్రాల నిరంతర పర్యవేక్షణకు హైపవర్ కమిటీ.
- ప్రశ్నపత్రాల తయారీ విధానంలో మోడరేషన్ పద్ధతిని నిలిపివేయడం.
- సిలబస్, మోడల్ ప్రశ్నపత్రాలను అనుసరించి నిపుణులైన అధ్యాపకులతో సెమిస్టర్ ప్రశ్నపత్రాల తయారీ.
- పరీక్ష ఫలితాల జాప్యాన్ని నివారించేందుకు మూల్యాంకన కేంద్రాలు పెంచడం.
- మూల్యాంకనం ముగిసిన 20రోజుల్లోపు ఫలితాల విడుదలకు చర్యలు. ఇందుకోసం ప్రత్యేక కమిటీకి సిఫార్సు.
- బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ను నియమించి బీబీఏ, బీసీఏ, బీకామ్ (కంప్యూటర్స్), బీఎస్సీ (కంప్యూటర్స్) సిలబస్ తయారు చేసేందుకు చర్యలు.
- వర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్లతో సమానంగా గెస్ట్ ఫ్యాకల్టీలకు వేతనాల మంజూరుకు సూచన.
- ఎస్ఎమ్ఆర్ ఉద్యోగుల అర్హతే ప్రామాణికంగా టైమ్‌స్కేల్ మంజూరుకు చర్యలు.

ఈ మేరకు ఎస్వీయూలో త్వరలో నిర్వహించనున్న సమావేశంలో వర్సిటీ అధికారులతో ఈసీ సభ్యులు సీకామ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ భూమన సుగుణారెడ్డి, వేద వ్యాస విద్యా సంస్థల అధినేత సి.నారాయణ బాబు, ప్రొఫెసర్ కె.సుమ కిరణ్, సామాజిక వేత్త వి.జ్యోతి, ప్రొఫెసర్ జి.పద్మనాభం, డాక్టర్ ఏ.మోహిద్దీన్‌బాషా, ప్రొఫెసర్ కె.మంజుల, అధ్యాపకులు ఎం.సంధ్యారాణి చర్చించనున్నారు.



ఎస్వీయూ పరిపాలనా భవనం

శాస్త్రోక్తంగా బిల్వార్చన.. కుంకుమార్చన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు అభిషేకం, గణ పతి పూజ చేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో కోటి బిల్వార్చన, అమ్మవారి సన్నిధిలో కోటి కుంకుమార్చన జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చన నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.



బిల్వార్చన చేస్తున్న వేదపండితులు

సిరులతల్లి బ్రహ్మోత్సవాలకు సాంస్కృతిక శోభ

చంద్రగిరి(తిరుచానూరు): సిరులతల్లి.. భక్తుల పాలిట కల్పవల్లి.. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక శోభ ఉట్టిపడుతోంది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు, శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శిల్పారామం వేదికగా భక్తి పాటలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన గజ వాహనం పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక పాటలకు నృత్యం చేశారు. ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు హరినాథ్ ఆధ్వర్యంలో వివిధ పాటలకు సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు చక్కని నృత్యం ప్రదర్శించారు.



శిల్పారామంలో నృత్య ప్రదర్శన

భూసర్వేను వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: జిల్లాలో భూసర్వే పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన డీఆర్వో పెంచల కిషోర్, డెప్యూటీ కలెక్టర్ భవానీ శంకర్, సర్వే ఏడీ జయరాజ్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే డీటీ అధికారులతో ఆయన మాట్లాడారు. భూముల రీసర్వే, మ్యుటేషన్, సాదా బైనామా, అసైన్‌మెంట్ భూములు, రాళ్ల నాటే ప్రక్రియ తదితర అంశాలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో ఎంపీ వేమిరెడ్డి



శ్రీవారి ఆలయ వెలుపల ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కగా నడిచి వెళుతున్న ముగ్గురిపై కారు దుసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్(43) అనే వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. పట్టణ పరిధిలోని మునిరత్నం నగర్(మాలయకోట) ప్రాంతానికి చెందిన దుర్గా ప్రసాద్ వంటమాస్టర్. బిరదవాడ గ్రామంలో వంట పని కోసం మునిరత్నం నగర్ ప్రాంతానికి చెందిన మస్తానయ్య, పవన్‌ను తీసుకుని రహదారి పక్కన నడిచి వెళుతున్నారు. అదే సమయంలో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న ఆ ముగ్గురిపై దుసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ మృతి చెందగా.. మస్తానయ్య, పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

బస్సు అపహరించిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో టీటీడీకి చెందిన బస్సును అపహరించిన కేసులో తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలం, చిరంజీవి రెడ్డి క్వార్టర్స్‌కు చెందిన నీలవర్ విష్ణుకు 3 నెలలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండోఅదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు.

క్యాన్సర్ రహిత జిల్లానే లక్ష్యం

తిరుపతి తుడా: క్యాన్సర్ ఫ్రీ జిల్లాను ఆవిష్కరించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. దాతల సహకారంతో స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్న పింక్ బస్సును మంగళవారం డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే విధానం, పింక్ బస్సులో వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

వీవీఆర్ ఫౌండేషన్ రూ.2.75 కోట్ల విరాళం

వీవీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో రూ.2.75 కోట్ల విలువ గల పింక్ బస్సును స్విమ్స్‌కు విరాళంగా అందించారని స్విమ్స్ డైరెక్టర్ తెలిపారు. డాక్టర్ జయచంద్రా రెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.